నల్లత్రాచు

చంద్రశేఖర అజాద్

పగ నన్ను కాల్చేస్తోంది.

నాలోని అణువణువునీ ఉద్రేకానికిలోను చేస్తోంది. నా శరీరం కొన్ని సంవత్సరాలుగా చల్లబడి ఎరుగదు. నా కళ్ళు సైతం ఎర్రగానే ఉంటున్నాయి. నా చెల్లి జీవితంతో ఆడుకున్న దుర్మార్గుడు మాత్రం ఆనందంగా జీవితాన్ని అనుభవిస్తూనే ఉన్నాడు. నా పగ చల్లారటానికి ఏ ఏ మార్గాలు అవలంబించాలో ఎంతగానో పరిశీలించాను. వాటిలో కొన్ని అమలు చేశాను కూడా. అయితే నేం అవేం విజయవంతం కాకపోగా నాకు మరింత నరకాన్ని సృష్టించాయి.

నేను నిస్సహాయుడుగా మిగిలిపోతున్నాననే బాధ నా హృదయాన్ని రంపంలా కోస్తోంది. నాది పేదవాడి కోపంలా తయారయింది.

సముద్రపు ఒడ్డున కూర్చున్న నాకు ఇంకెంతో నిరాశ పేరుకుపోతోంది. ఉవ్వెత్తున్న లేచి పడుతున్న కెరటాలు

నల్లటి రాళ్ళకు తగిలి తుంపరలై గాల్లోకి ఎగిరి తిరిగి నీళ్ళలో కలిసిపోతున్నాయి.

నేనుకూడా అంతేనేమో? నా ప్రయత్నాలు ఫలించవేమో? జీవచ్ఛవంలా బ్రతకటమే నా చివరి పరిణితేమో!

రవి శరీరం కూడా అలా ముక్కలై, గాల్లోకి కలిసిపోతే నేను చాలా ఆనందించేవాడిని. కానీ ఎలా?

మరోప్రక్క నా హృదయం ఘోషిస్తోంది. ఆ కెరటాల నిరంతర దాడి మూలంగానే కఠినమైన, కరుకైన ఆ నల్లనిరాళ్ళు నున్నగా మారాయని. శతాబ్దాల కాలంలో వాటి అస్తిత్వాన్నే కోల్పోయేలా చేయగలవని. కానీ సముద్రం అనంతం. సముద్రంతోనూ, నిరంతరం ఎగిసిపడే అలలతోనూ నన్ను పోల్చుకోవటానికే సిగ్గు కలుగుతుంది.

నాకు మొన్నటి సంఘటన కళ్ళముందు మెదిలింది....

రవి కొడుకు ఓ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నాడు. వాడ్ని కనుక మాయంచేస్తే, గొంతు పిసికి చంపిపారేస్తే. ఆ విషయం తెలుచుకొని వాడు గుండెలు పగిలేటట్టు ఏడిస్తే అప్పుడు నాకు మనశ్శాంతి. వాడు చేసిన అన్యాయానికి అది ప్రతీకారం అవుతుంది.

ఈ నడుమకాలంలో నా గడ్డం బాగా పెంచాను. అంతకుముందు నాకు మీసాలు ఉండేవికావు. చెవిపైకి వెంట్రుకలు కత్తిరించుకునేవాడిని. ఇప్పుడంతా మారిపోయింది. ఇరుకైనబట్టలు, కాళ్ళకుబూట్లు. అయినా ఇవి నా పట్ల చులకన భావాన్ని కలిగించకపోవటం నా అదృష్టం.

రవి కొడుకు పేరు నవీన్. చాలా ముద్దుగా ఉంటాడు. రవి ఊర్లో చిన్న కాన్వెంట్స్ లేకపోలేదు. అయినా

వాడ్ని ఇక్కడే చదివిస్తున్నాడు. అంత చిన్నవయసు లోనే పిల్లలు తల్లితండ్రులకి దూరంగా ఉండటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒకరకంగా అదే మంచిదేమో. ఒకరికొకరు అనుబంధాలు పెంచుకొని విడిపోయేటప్పుడు కృంగిపోవటంకన్నా, చిన్నతనం నుండీ ఇలాంటి వాతావరణంలో పెరగటం మంచిదనుకుంటాను.

నా విషయంలో నాకెలాంటి అనుమానం లేదు. ఆ పబ్లిక్‌స్కూల్ వారిని సమాధానపరిచి నవీన్‌తో బయటకు రావటం నాకంత సమస్యకాదు. ముందు ఫోన్ చేసి 'రవి' మాట్లాడినట్లు మాట్లాడుదామనుకొన్నాను. అయితే ఓసారి పబ్లిక్‌స్కూల్ వాతావరణం పరిశీలించి రావాలని బయలుదేరాను.

అది సాయంకాలం. పిల్లలంతా ఆడుకుంటున్నారు. ఇంకా ఆ స్కూల్ నిర్మాణం పూర్తికాలేదు. విశాలమైన ప్రాంతంలో ఆ స్కూల్ ఏర్పాటుచేశారు. పెద్ద భవనాలు రెండు నిర్మించారు. వాటిల్లోనే ప్రస్తుతం క్లాసులు నిర్వహిస్తున్నారు.

అవికాక మరో రెండు భవనాలు నిర్మాణంలో వున్నాయి. అవి దాటాక దూరంగా చెట్లు. ఆ ప్రాంతమంతా కొండప్రాంతం. అప్పటికే కొందరు ఫ్యాక్టరీలకు గాని, మరే ఇతర అవసరాలకుగాని ఆ స్థలాలు కొనేసి చుట్టూ ఫెన్సింగ్ నిర్మిస్తే, మరికొందరు యూకలిప్టస్ మొక్కల్ని నాటారు. ఇంకా ఇళ్ళప్లాటులు వేసినట్టుగా రాళ్ళు పాతబడి ఉన్నాయి.

ఇంతకంటే మంచి వాతావరణం కూడా లభించదు.

ఇప్పుడు నవీన్ని పలకరించి, మెల్లగా తీసుకెళ్ళగలిగితే, ఆ చెట్లతోపుల్లో వాడి గొంతు పిసికేసి రావచ్చు. ఆ

తర్వాత నవీన్ గురించి వాళ్ళు తెలుసుకొనే లోపు నే నెక్కడుంటానో!

ముందు వాళ్లు నవీన్ కనపడటంలేదని గుర్తించాక రవికి ఫోన్ చేసి ఈ విషయం తెలియచేస్తారు. రవి 'ఇంటికి రాలే'దంటాడు. "మరి కనపడటం లేదుసార్" అని వారంటారు. "ఏమైపోయాడు" అంటూ వారి అజాగ్రత్తమీద కేకలేస్తాడు. గుండెలు జారిపోతుండగా పోలీస్ స్టేషన్లన్నింటికి ఫోన్ చేస్తాడు.

వెంటనే బయలుదేరి వస్తాడు.

యూకలిప్టస్ చెట్లనడుమ నవీన్ శవం వికృతంగా కనపడుతుంటే....బిగ్గరగా అరిచి....కుళ్ళు కుళ్ళి ఏడుస్తుంటే....ఇంకెక్కడి నవీన్! ఎవరుమాత్రం తీసుకురాగలరు!

నా పెదవులమీద చిరునవ్వు మొదలయింది.

ఆ చుట్టుప్రక్కల ఎవరూ లేకుంటే ప్రకృతి అంతా ప్రతిధ్వనించేటట్లు కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగేటట్లు వికటాట్టహాసం చేసేవాడ్ని.

ముందుకు నడిచాను.

పిల్లలు ఆడుకుంటున్నారు— ఈ లోకాన్ని మరిచిపోయి. వారంతా ఒకే డ్రస్‌లో ఉన్నారు. వారి నడుమ కుల, మత, ధనిక, పేద భావాలు లేవు. నిష్కల్మషంగా వారలా ఆడుకుంటుంటే ఎంతో చూడ ముచ్చటగా ఉంది. వారిలో ఎర్రటిపిల్లలు, నల్లగా ఉన్నవారు, బలంగా ఉన్నవారు, బలహీనంగా కనపడుతున్నవారూ ఉన్నారు. అయినా అందరిలోనూ ఏదో ఆకర్షణ. నా దృష్టిమాత్రం నవీన్ మీదే వుంది. 'నవీన్'— పేరుబాగా నే పెట్టాడు.

వీడు కూడా రవిలా తయారయితే ప్రపంచానికి భారంగా తయారవుతాడు. ఇప్పుడు నేను చేస్తున్నపని ఆ భారాన్ని తగ్గించటమే.

నవీన్ బుగ్గలు పాలుకారుతున్నాయా అన్నట్లున్నాయి. బహుశా తల్లి పోలికేమో! వాడెంత ముద్దొస్తున్నాడంటే పది నిముషాలనుండి చూస్తున్నాను కాని నాలో మరో ఆలోచన కలగటంలేదు. అలానే ముందుకు నడుచుకుంటూ వెళ్ళాను.

దూరంగా యూకలిప్టస్ చెట్లున్నాయి. వాటి మధ్యగా నడుస్తుంటే కాళ్ళక్రింద ఆకులు నలుగుతున్నాయి. దూసుకొస్తున్న గాలి చేస్తున్న శబ్దం వింతగా ఉంది. చేతికందిన ఓ ఆకును త్రుంచి దాన్ని నడుమకుతుంచి వాసనచూస్తే హాయిగా ఉందనిపించింది.

నాలో ఇప్పుడు ప్రతీకార జ్వాలలులేవు. నన్నెందుకో ఓ రకమైన ప్రశాంతత ఆవరించినట్లయింది. అందుకే నా అంతరాత్మ నాపై ఎదురు తిరిగి ప్రశ్నించింది.

"ముక్కుపచ్చలారని పిల్లవాడ్ని చంపబోవటానికి నీకు చేతులెలావచ్చాయి? నీ పగ వాడిమీదనా! ఎంత దారుణం? నీకు అన్యాయం చేసినవాడ్ని ఏమీ చెయ్యటం నీకు చేతకాకపోతే, ఈ ప్రపంచంలో ఏదో మూలకెళ్ళి బ్రతుకు. లేదంటావా వాడి అంతం చూడటానికి ప్రయత్నించు. అంతేగాని ఏ పాపం ఎరగనివాడ్ని, కేవలం రవి బిడ్డ అయిన నేరానికి బలిచేస్తే అంతకంటే అన్యాయం ఏముంటుంది? నీ చేతగానితనం, నీ రాక్షసత్వం కాదా ఇది?" అంటూ అంతరాత్మ నిలదీస్తూంటే నిజంగా నే కదిలిపోయాను.

ఎంతటి దారుణమైనపనికి పూనుకున్నాను. ఇంకా

ప్పుడూ ఇలాంటి ఆలోచనలకు దారి తియ్యటం జరగ కూడదని బలంగా నిర్ణయించుకున్నాను. నా వైరం రవి తో నే. నాకు చేతనయితే వాణ్ణే ఏమయినా చెయ్యాలి. ఆ రకంగా నా ప్లాను రూపొందించుకోవాలి.

ఆ చెట్లనుండి మంచిగాలి పీల్చుకొని తిరిగి వచ్చేశాను.

నా కాళ్ళను తడిపేసి వెనక్కి వెళ్ళుతున్న నీళ్ళు నన్ను తిరిగి వాస్తవంలోకి తెచ్చాయి. చీకట్లు ముసురుకుంటు న్నాయి. సముద్రంఒడ్డున జనం పలచ పలచగా ఉన్నారు. ఘోష మాత్రం నాలో ఆందోళనలా వుంది. లేచి నిల బడ్డాను. ఇసుకలో నడుచుకుంటూ ముందుకు వెళుతు తున్నాను.

ఏం చేయాలి? ఎలా ఈ సమస్యను పరిష్కరించాలి.

2

ఆ రోజు....

చిట్టితల్లి-నా బంగారుచెల్లెలు నిద్రబిళ్ళలు మ్రింగిందని, హాస్పిటల్లో చేర్పించారని తెలియగానే గాలితో సమా నంగా పరిగెత్తుకెళ్ళాను.

బెడ్ మీద ఈ ప్రపంచాన్ని మరిచిపోయి నిద్రపో తూంది. అమ్మ కళ్ళనుండి నీళ్ళు! ఆమె హృదయపులోతుల నుండి పొంగివస్తున్న దుఃఖం ఆపుకోవటానికి కొంగు నోట్లో పెట్టుకుంది. ఎన్నిబిళ్ళలు మ్రింగిందో ఏమో?

అమ్మతో ఏం మాట్లాడలేకపోయాను.

నాకయితే ఎన్నెన్నో అడగాలనుంది. ఎందుకు చని పోవాలనుకుంది? ఇంట్లో గొడవలు ఏమైనా జరిగాయా? గొడవలు ఏం జరుగుతాయి! ఇంట్లో చిట్టితల్లికంత స్వేచ్ఛ ఉంది. నాన్నపోయాక మేం ఆమెన్ని చెల్లిలో చూసు కుంటున్నాం.

అలాంటి చెల్లి....మంచి సంబంధం చూసి పెళ్ళిచేసి పంపించాలనుకుంటున్న నా చిట్టితల్లి—ఈ ప్రపంచం గురించి స్పృహ లేకుండా అలా మంచంలో పడిపోయిం దెందుకు? నా చిట్టితల్లి గుండెల్ని నిర్దాక్షిణ్యంగా బ్రద్దలు చేసిందెవ్వరెవ్వరు? ఈ జీవితంమీదే విరక్తి పెంచుకొని, మమ్మల్ని శోకసాగరంలో ముంచెత్తి వెళ్ళిపోవాలన్న దారుణ నిర్ణయానికి నా చిన్నారి రావటానికి ఏ పరిస్థితులు, ఏ దుర్మార్గులు కారణం?

నేను చెల్లి ప్రక్కన కూర్చుని ఆమె తల వెంట్రుకలు సరిచేస్తుంటే నా పెదవులు ప్రకంపిస్తున్నాయి. నా అంతరాంతరాల లోతుల్నుండి దుఃఖం వెల్లుబికి వస్తోంది.

అయిపోయింది.

చిట్టితల్లీ నీతో అనుబంధం ముగిసిపోయింది.

అప్పుడే నూరేళ్ళ జీవితం గడిచిపోయింది.

ఎందుకింత దారుణమైన నిర్ణయం తీసుకున్నావో మాతో రెండుముక్కలయినా చెప్పిపోయావా? ఎంత ఘోరం జరిగిపోయింది.

ఏమ్మా! మేం నీ పట్ల అంత నిర్దయగా ప్రవర్తించామా?

మాపట్ల నీకంత అనుమానం ఎందుకు కలిగిందమ్మా?

'నా బాధ ఇది' అని ఒక్కముక్క చెప్పగలిగితే ఎంత బాగుండేది!

అయ్యో ఇప్పుడేమిటి చెయ్యటం?

ఏమిటి తల్లీ ఏమిటీ ఘోరం. నిన్న నీవు పాడినపాట ఇంకా నా చెవుల్లో మారుమ్రోగుతుంది.

నీ నవ్వులు నా గుండెల్లో ఉన్నాయి.

అమ్మా! నీ నడకలు....నీ కళ్ళు... నీ ఆప్యాయత

అన్నీ నీలోనే దాచుకొని వెళ్ళిపోయావా.... వెళ్ళిపోయావా....

నీ మీద కూలిపోయిన అమ్మ అలానే ఉండేమిటి?

చిట్టి తల్లితో కన్నతల్లీ నువ్వు వెళ్ళిపోయావా?

మీరిద్దరూ కలిసి వెళ్ళిపోతే నేనెందుకు బ్రతకాలో చెప్పమ్మా.... చెప్పు....

నా గుండెలేనా అంత పాషాణం!

3

ఇదే నా చివరి ప్రయత్నం. ఇదికూడా విఫలం అయితే మరే ప్రయత్నం చెయ్యను. దూరంగా వెళ్ళిపోతాను. ఎక్కడో బ్రతుకుతాను. లేకుంటే ఈ ప్రపంచం నుండే తప్పుకుంటాను. అంతకంటే ఏం చేయను మరి!

నా దగ్గర డబ్బులు అయిపోవచ్చాయి. కొన్నాళ్ళు రిక్షా నేర్చుకొని రాత్రంతా రిక్షా త్రొక్కాను. నా ఖర్చులుపోను కొంత నిలవచేయటంకోసం ఎంతగా కష్టపడ్డానో తలుచుకుంటే నాకే ఆశ్చర్యం కలుగుతుంది.

ఇదివరలా కాకుండా ఇప్పుడు నా శరీరం, మనసు దృఢంగా ఉన్నాయి. రగులుతున్న పగ మూలంగా నే ఎలాంటి కష్టాన్నయినా ఎదుర్కోవటానికి సిద్ధపడ్డాను.

నేను నరసయ్యను కలవాలని నిర్ణయించుకున్నాను.

నరసయ్య పాముల్ని పట్టుకుంటాడని, ఎలాంటి పామునయినా క్షణాల్లో లొంగదీసుకుంటాడని అతనికి చెందిన ప్రచారంలో ఉన్నాయి.

నరసయ్య పాముకు మంత్రం వేస్తాడని, మంత్రం వేయగానే కదలలేని స్థితిలో ఉంటుందని—అప్పుడు పట్టుకుంటాడని కొందరంటే, మరికొందరేమో అసలు నరసయ్యకు పాము విషం ఎక్కదని, పాము నరసయ్యను

కరిస్తే పాము చచ్చిపోతుందని చెప్పుకుంటారు.

చిన్నప్పటినుండి నరసయ్య పాముల నడుమే పెరిగాడట. అతనిదగ్గర ఏదో వేరుందట. అందుచేత నే ఎలాంటి పాము కూడా కరవదట.

ఏది ఏమయినా ఒక విషయం మాత్రం నిజం. నరసయ్య చాలా పాముల్ని పట్టాడు. చాలామంది తమ తమ ఇళ్ళలో దొడ్లలో పాములు కనపడితే, వాటిని కొట్టడానికి ధైర్యం చాలకుంటే వెంటనే నరసయ్యకు కబురు చెయ్యమని అంటారు. నరసయ్యను పాములు పట్టేవాడంటారు. మిగతా సమయాల్లో ఏం చేసినా అదే ఆయన ప్రధాన వృత్తిగా ప్రచారం అయింది. ప్రవృత్తి రీత్యా విపరీతంగా తాగి ఆ మత్తులో మునిగిపోయి వుంటాడు.

నేను నరసయ్యను కలుసుకున్నాను. ముందుగా ఊహించినంత భయంకరంగా మాత్రం లేడు.

"ఏంటి పంతులూ" అన్నాడు.

నేను విషయం పూర్తిగా చెప్పలేను.

"నాకో పాము కావాలి" అన్నాను.

"పామా, ఎందుకు?" అన్నాడు.

"పనుంది" అన్నాను.

"పాముతో పనేందయ్యా పంతులూ" అన్నాడు.

నేను వెంటనే మాట్లాడకపోయేసరికి "ఎన్ని పాములు కావాలేటి" అన్నాడు అనుమానంగా.

"ఒక్కటిచాలు. అయితే కరిస్తేమాత్రం మనిషి చావాలి" అన్నాను.

నరసయ్య ఆశ్చర్యంగా చూశాడు.

"నరసయ్యగారూ మనం కొంచెం ఏకాంతంగా

మాట్లాడుకోవాలి" అన్నారు.

అత నేమనుకున్నాడో లేచి వచ్చాడు.

నేను మొత్తం నా కథంతా చెప్పాను.

"ఇదే నా చివరి ప్రయత్నం. నా పగ చల్లారాలంటే నువ్వు సహకరించాలి" అన్నాను.

"సర్లేపంతులూ" అన్నాడు నరసయ్య.

నాకూ చాలా ఆనందం కలిగింది. నరసయ్య వెంటనే అంగీకరించగలడని నేను భావించలేదు. చిట్టితల్లి మరణం గురించి నేను వర్ణించటం, నవీన్ విషయంలో నేను చూపిన దయ అతన్ని అంగీకరించేట్లు చేశాయనుకుంటాను.

"పాములు దొరకటం లేదయ్యాపంతులు....మంచి పాము కావాలంటే కానా ఖర్చయిపోద్ది" అన్నాడు ఖచ్చితంగా.

నరసయ్య ఆ విధంగా డిమాండ్ చెయ్యటంకూడా సరయిందే. మన దేశంలో ఉన్న పాముల రకాల్లో విష పూరితం అయినవి కేవలం అయిదారు రకాలకు మించి ఉండవు. వాటన్నింటిలోకి శక్తివంతమయినది త్రాచు. వాటిలో నల్లత్రాచు, గోధుమవర్ణత్రాచు ఉన్నాయి. వీటికంటే ప్రమాదకరమైన పాము "కోబ్రా". అది దక్షిణాఫ్రికా అడవుల్లో ఉంటుంది.

'కోబ్రా' కాటుకు గురయితే బ్రతకటం అసంభవం. మనిషి మరణించటానికి అవసరమయిందానికంటే మూడు రెట్లు ఎక్కువ విషం ప్రొడ్యూసవుతుంది.

భయంతోగాని, మరోకారణంతోగాని మానవుడు పాముల్ని నాశనం చేస్తున్నాడు. రాను రానూ వాటి సంఖ్య తరిగిపోతోంది. ప్రధానంగా పాము చర్మాల ఎగుమతి వివిధ మార్గాల్లో జరుగుతోంది. వాటికి విదేశాల్లో

విపరీతమైన గిరాకి ఉంది.

పాము విషానికి కూడా ఎంతో గిరాకీ ఉంది. కొన్ని ఔషధాల తయారు చేయటానికి ఈ విషయం వినియోగిస్తారు. పాము విషానికి విరుగుడుగా పాము విషాన్నే వినియోగిస్తున్నారు. ఏ రకంగా చూసినా పాము విలువయినదే.

పాముకు పగ ఉంటుందా, ఉండదా అని చర్చించబడుతున్న కాలంలో నేను పాముద్వారా పగతీర్చుకోబోతున్నాను. నిజానికి నాకు పామంటే చచ్చేంతభయం. జర జర పాక్కుంటూ పోతుంటే దూరంనుండి చూస్తేనే నా శరీరం జలదరించేది.

అలాంటిది నా పగ తీర్చుకోవటం కోసం పామున్నే ఆశ్రయించటం ఎంత విచిత్రం!

"రెండు రోజుల తర్వాతరా" అన్నాడు నరసయ్య.

"ఈ విషయం మూడోకంటికి తెలియకూడదు" అన్నాను.

"నీకా దిగులొద్దు" అంటూ అభయహస్తం ఇచ్చాడు.

నేను నరసయ్య చేతిలో వందరూపాయలుంచి వచ్చేశాను. నా మనసు ఓ ప్రక్కన పీకుతూనే ఉంది. ఈ వంద తీసుకొని తాగి పడుకుంటాడేమో, లేక ఏదో చెత్త పామును తెచ్చి తీసుకెళ్ళమంటే నేనేం చెయ్యాలి?

చిట్టితల్లీ .... నా నిరీక్షణ ఫలిస్తుందా?

నా పగ చల్లారుతుందా?

4

చిట్టితల్లి ఫొటోవంక తదేకంగా చూస్తూ పడుకున్నాను .... సంవత్సరాలక్రితం .... జ్ఞాపకాలు .... రీలులా.

చిట్టితల్లి ఫొటోలోనుండి ఎంత హాయిగా నవ్వుతుందని.

ఎంత నిర్మలంగా చూస్తుందని. ఆ కళ్ళు పాపగా ఉన్నప్పుడు తీసిందది. అదంటే నాకెంతో ఇష్టం. అలాంటిది ఈ రోజు చిట్టితల్లి నా ముందు లేదు.

చిట్టితల్లి రాసిన చివరి లేఖ నా కళ్ళముందు మెదిలింది.

అన్నయ్యా,

నీకు నేను రాస్తున్న మొదటి - చివరి లేఖ ఇదే కావటం ఎంత దురదృష్టకరం. నా పెళ్ళయ్యాక నిన్ను మా ఇంటికి ఆహ్వానిస్తూ లేఖ రాయాలని ఎంతో ఆశపడుతుండేదాన్ని. కానీ ఇలా రాస్తున్నాను.

మీరిచ్చిన స్వేచ్ఛ నన్ను పతనం చేసింది. అంత మాత్రాన స్వేచ్ఛ ఇవ్వటం మీ తప్పని నేనను. ప్రతి మనిషికి కూడా స్వేచ్ఛ అవసరం. స్వేచ్ఛ లేని జీవితాలకంటే మరణమే మేలు. ఇది నా దృఢాభిప్రాయం. ఆ స్వేచ్ఛ ఇతరులకు ఇబ్బంది కలగకూడదు. ఇతరులకూ స్వేచ్ఛ వుంటుందనే భావాన్ని విస్మరించకూడదు.

నేను చాలా తర్కబద్ధంగా రాస్తున్నా ఈ లేఖ. నా చెల్లి తెలివిగలదని నీవు అనుకోవచ్చు. నువ్వనుకోవటం కాదు. నేనే చాలా తెలివిగలదాన్ననే భావం ఈ లేఖ రాస్తుండక ముందు దాకా నాకుంది. నేను చాలా సినిమాలు చూశాను. అనేక ప్రేమ కథలు నవలలూ చదివాను. బహుశా నా జీవితంమీద వాటి ప్రభావం విపరీతంగా పడి ఉండవచ్చు. నేను ఎప్పటికప్పుడు నన్ను పరీక్షించుకుంటున్నా అగాధాల్లోకి జారిపోయాను. నా తెలివితేటలు యేమైపోయాయి!

అసలు తప్పెక్కడ జరిగింది?

రవితో నా పరిచయం ఓ ఘట్టని నాకు ముందుగా తెలియదు. ఈ దేశంలో యువతుల్ని ఆకర్షించటానికి పురుషులు ఎన్నెన్ని పాట్లు పడతారో కొన్ని సినిమాల్లో చూసి వాస్తవానికి దూరంగా ఉండేవనుకునేదాన్ని. కానీ ఇప్పుడనిపిస్తోంది. సినిమాలు చూసి యువకులు ఇలా అవుతున్నారా? ఇలాంటి వారిని చూసి సినిమాలు తీస్తున్నారా అని.

రవిని నేను ఎందుకు ప్రేమించాను అని ఈ రోజు ప్రశ్నించుకుంటున్నాను. అతనిలో అందముంది - కళ్ళు తిరిగిపోయేంతగా. అదే నన్ను ఆకర్షణలోకి దింపలేదు. అతనిలో ఇంకా కొన్ని లక్షణాలున్నాయి. ఇవన్నీ అమాయకులైన, కానీ తెలివిగలవారైన ఆడవారిని సైతం మాయ చేయటానికని తెలుసుకుంటుంటే నాకు శరీరం కోపంతో, బాధతో దిగ్భ్రాంతితో జలదరిస్తోంది.

ఓ వ్యక్తిని బలిచేయటానికి తమలోని ఆకర్షణనూ, అందాన్ని, కళల్ని వినియోగించుకోవటం ఆధునికం కావచ్చుగాని, పతనమైపోతున్న జీవితపు విలువల్ని సూచిస్తున్నాయి. ప్రేమకు, కామానికీ నడుమ వున్న గీతను చెరిపేస్తున్న ఈ తరం ఇలానే వుంటే ఈ దేశానికి భవిష్యత్ ఉండదు.

నా సమస్య నేను పరిష్కరించుకోలేక మరో మార్గం వెతుక్కుంటున్న అతి తెలివిగల యువతిని నేను. అయినా నేను దేశ భవిష్యత్ గురించి

కూడా రాస్తున్నాను. ఇంత గొప్ప అవగాహన గల నీ చిట్టితల్లి ఓ పురుషుడి అందాల ఆకర్షణల గోతుల్లోపడి....గర్భం తెచ్చుకుందంటే నువ్వెంతగా శోకిస్తావని....అమ్మెంతగా తల్లడిల్లిపోతుందని నేనూహించనా....

కానీ నా ఓటమి నన్ను వెక్కిరిస్తోంది.

నాది కూడా పాత కథ....చాలా పాత కథ. కనీసం సీసా కూడా కొత్తది కాదు. రవికి ప్రేమంటే పడక గదని, ఆడదంటే కామాన్ని పంచే వస్తువని చాలా తేలిక భావాలున్నాయని నాకు తెలిసేటప్పటికి యెంతో ఆలశ్యమైంది. ఇప్పటిదాకా నేనెంతో మధురంగా దాచుకున్న అతని జ్ఞాపకాలు....నాటకాలు యెంత హేయమైనవో తెలుసుకొని వాటినుండి వెంటనే బయట పడాలనుకుంటున్నాను.

నాకు తెలుసు. రేపీలోకం నామీద వ్రేలెత్తి చూపిస్తుంది. ఈ రవిలాంటి సవాలక్ష మగవాళ్ళు నేరమంతా నాపైకే నెట్టేస్తారని. ఒక స్త్రీ పొందుకోసమే రకరకాల పద్ధతుల్ని అనుసరించే ఈ మగవాళ్ళను, ఏ పొందుకోసమైతే ఎంతగా దిగజారిపోతారో అవసరం తీరాక అంతగా అవహేళన చేసే ఈ జాతిని నా మరణంతో శపిస్తున్నా....

నేను తప్పుచేశాను. నిజమే. కాదనటంలేదు. కానీ ఓ గుడ్డి నమ్మకంతో ఓ అనుభూతితో, ఆ తీవ్రతలో నేను పొరబడ్డాను.

అయితే అనేక కథలలాగే నా జీవితానికి

ముగింపు ఏమిటి? అమ్మను తలుచుకుంటే నేను కంపించిపోయాను. ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోయి బ్రతకాలనుకున్నాను. తిరిగి నా బిడ్డను ఈ సమాజం యెలా ట్రీట్ చేస్తుందో నాకు తెలుసు.

ఆత్మహత్య యెంత నేరమో నాకు తెలుసు. అయినా నాకీ పరిష్కారమే సరయిందనిపించింది. ఈ లేఖ ఇంతటితో ముగిస్తే నీకు అన్యాయం చేసిందాన్నవుతాను.

'రవి' అడ్రసు ఇస్తున్నాను. అయితే ఈ లేఖను ఆత్మహత్య తర్వాత 'రవి'ని ఏమైనా చేయటానికి ఉద్దేశించి రాయటంలేదు. నాకీ సమయంలో ప్రపంచాన్ని విడిచిపెట్టి వెళ్ళాలని తప్పించి మరే ఆలోచనాలేదు. ఈ విషయం తెలిస్తే రవి తనవల్ల ఓ స్త్రీతోపాటు ఈ ప్రపంచంలోకి సగర్వంగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ రావలసిన ఓ బిడ్డ బలయిపోయినందుకు పశ్చాత్తాప పడితే....అతని కళ్ళ నుండి కన్నీటి బొట్లు రాలిస్తే నేను చేసింది తప్పేనని.. నేరమని అంగీకరిస్తున్నాను.

కానీ రవి నేరమంతా నాపై నెట్టి, నాతో పాటు ఈ స్త్రీ జాతిని అవహేళనచేస్తే తన తప్పును సమర్థించుకుంటానికి గంభీరమైన సమర్థనలు వెతికితే..మరోసారి సాహసిస్తున్నాను. క్షమించు.

ఈ దేశం తగలబడిపోతుంది.. స్త్రీల హత్యల్తో ఆత్మహత్యల్తో....దహనాల్తో....

నీ చిట్టి తల్లి చివరి కోర్కె అది!

రవి ఏడ్చినా....ఏడ్వకపోయినా

నువ్వు మాత్రం గుండెలు పగిలిపోయేలా యేడుస్తావని నాకు తెలుసు........చాలా రాశాను.... అమ్మమ్మా .. నీకూ నేను అన్యాయం చేసి పోతున్నాను.

నీ చిట్టి చెల్లెలు,
జ్యోతి."

"జ్యోతీ" బిగ్గరగా అరిచాను.

గదంతా గాఢాంధకారం. కరెంట్ పోయింది కాబోలు....నాకు చెమటలు పట్టేశాయి.

జ్యోతిని నా చెల్లెలుగా భావించటంలేదు. ఆమెను దారుణంగా హత్య చేసిన రవిలాంటివారు ఈ మరణం పట్ల యెలా ప్రవర్తిస్తారో నేనూ తెలుసుకోవాలి.

ఈ లేఖ చదివాక నాకు యేడుపు రావటంలేదు. నా కళ్ళలో నీరు అప్పటికే ఇంకిపోయిందేమో!

వెంటనే రవి ఇంటికి వెళ్లాను.

బజర్ నొక్కాను. లోపల మ్రోగటం, వెంటనే ఎవరో నడిచివస్తున్న సవ్వడి వినిపించింది. తలుపు తెరుచుకుంది....

"ఎవరండి" అంది ఆమె.

"రవీంద్ర ఉన్నారా?"

"ఉన్నాడు."

"కొంచెం పిలుస్తారా?"

"స్నానం చేస్తున్నాడు. లోపలకు రండి" అందామె.

నేను లోపలకు వెళ్లాను. అక్కడ వున్న కుర్చీలు చూపించి "కూర్చోండి" అని ఆమె లోపలకు వెళ్ళి

పోయింది. ఆమె బహుశా రవి తల్లి కావచ్చు.

పదినిమిషాల తర్వాత అతను వచ్చాడు.

"ఎవరు?" అన్నాడు.

చూట్టానికి చాలా చక్కగా ఉన్నాడు. చిట్టితల్లే కాదు. ఎవరయినా అతన్ని చూడగానే వెంటనే దృష్టి మరల్చుకోరు.

"నేను....కొంచెం బయట కెళ్దాం!"

"డెఫినెట్లీ....మీ రెవరో?" అన్నాడు రవీంద్ర సగంలో ఆపి.

"జ్యోతి అన్నయ్యని"

"జస్టేమినిట్" అంటూ రిష్యనలోనికి వెళ్ళాడు.

"కమాన్. లెట్స్గో" అంటూ ముందుకు నడిచాడు.

మరో నిముషంకల్లా అతను మోటారు సైకిల్ స్టార్ట్ చేశాడు.

"కూర్చోండి" అన్నాడు.

నేను మాట్లాడకుండా వెనక కూర్చున్నాను.

"ఎంత ధైర్యం" అనుకోకుండా ఉండలేకపోయాను.

దగ్గర్లోవున్న ఓ పార్కు దగ్గరికి తీసుకెళ్ళాడు. బండి పార్కు చేశాక చిన్న కొలనుదగ్గరకు తీసుకువెళ్ళాడు. అక్కడ ఎవరూ లేరు.

నేను చిట్టితల్లి రాసిన లేఖ అతనికిచ్చాను.

మౌనంగా అందుకొని చదివాడు. చదువుతున్నప్పుడు అతని భృకుటి ముడిపడటం నేను గమనిస్తూనే ఉన్నాను. అంతకు మించి ఆ ముఖంలో తప్పుచేశాననే భావంకానీ, పశ్చాత్తాపంగానీ రేఖా మాత్రంగానైనా లేదు.

"చిట్టితల్లికి మూడో నెల"

"చెప్పింది"

"ఆ బిడ్డకు తండ్రివి నువ్వు"

"అందుకే ఎబ్బార్షన్ చేయించుకోమన్నాను"

"అది నేరం."

"ఎబార్షన్ చట్ట సమ్మతమే" అన్నాడు రవీంద్ర.

"చిట్టితల్లి మందుబిళ్ళలు మింగింది"

రవీంద్ర మాట్లాడలేదు.

"చిట్టితల్లి చచ్చిపోయింది" కంఠం వణికింది.

నిశ్శబ్దం....!

"నువ్వే చంపావ్" అరిచాను.

రెస్పాన్స్ లేదు.

"నా చెల్లి నెందుకు మోసం చేశావ్?"

"నీ చెల్లే రాసిందిగా"

"నిన్నింత ఈజీలో వదలను"

"ఏం చేయాలని" సూటిగా అడిగాడు.

ఏం చేస్తానని చెప్పను? అతనంత సూటిగా అడిగే టప్పటికి షాక్ తిన్నాను.

"ఆ లేఖ పోలీసులకు ఇస్తాను. నిన్ను కటకటాల వెనక్కి పంపేదాకా నిద్రపోను" అన్నాను ఆవేశంగా.

మరుక్షణం నా మొఖం అదిరిపోయింది.

నా కళ్ళముందు మెరుపులు కనిపించాయి.

బలంగా మొఖం మీద చరిచేటప్పటికి నా ముక్కు అదిరిపోయి రక్తం బొటబొట కారటం మొదలయింది. ఆ విసురుకు క్రిందపడ్డాను. పడి అలానే చూస్తుండి పోయాను.

జేబులో నుండి లైటర్ తీశాడు.

చిట్టితల్లి లేఖ ఓ చేతిలో వుంది.

లైటర్ నుండి జ్వాల మాసుకొచ్చింది.

కాయితాలకు అంటుకున్న మంటలు ఎగబ్రాకుతున్నాయ్. నా 'జ్యోతి' స్వయంగా రవి చేతుల్లో తగలబడిపోతున్నట్లనిపించింది. క్రిందినుండి లేవకుండా ఆ దృశ్యాన్నే చూస్తున్నాను.

అప్పుడప్పుడు గాలి వీస్తోంది.

దాంతోపాటు ఆ కాగితాల బూడిద కొట్టుకో పోతోంది.

నేను కేవలం బెదిరించటానికన్నాను.

అప్పటికాకా కూడా నా చెల్లి మరణంపట్ల దుఃఖం తప్పించి నాలో ప్రతీకారభావం లేదు.

మొదటిసారిగా నాలోని దానవుడు నిద్రలేచాడు!

రవి నడుముకు కట్టుకున్న ఛైన్ తీశాడు.

"దీంతో నీ తలమీద కొడితే ఏమవుతుందో తెలుసా? రెండు ముక్కలవుతుంది. అప్పుడు ఛప్తాప్. ఇప్పుడు నిన్ను ఈ కాలనులో గొంతుపిసికి పారేస్తాను. దిక్కెవరు? నాకు ప్రేమించటం, వాడుకొని విసిరేయటం, కాల రెత్తుకు తిరగటం ఎలాగోకూడా తెలుసు. నువ్వు నీ చెల్లెలికి పాఠాలు నేర్పుకుంటే నీ కీ స్థితి వచ్చేదికాదు. ఆడది వస్తానంటే నువ్వు కాదంటావా? ఈ కవిత్వం నీ చెల్లికి ముందే వుండాల్సింది. నేను మీ చెల్లిని చావమనలేదు. కడుపు తీయించుకోమని చెప్పా....ఆ తర్వాత ఎవడో ఒకడ్ని కట్టుకోమని చెప్పా. నేను పరిచయమయిన వారందరినీ కట్టుకోవాలంటే నాకు సాధ్యం కాదు. అర్థమయిందా."

నా గుండెలు వేగంగా కొట్టుకొంటున్నాయి.

"ఈసారెప్పుడైనా నాకు కనపడ్డా. పిచ్చివేషాలు వేసినా జాగ్రత్త. నా మోటార్ సైకిల్ తో గుద్ది చంపే

స్తాను. నువ్వు పోలీసుల దగ్గరకు వెళదామనుకుంటున్నావేమో. మీ చెల్లి ఆత్మహత్య చేసుకోనిటాకి నువ్వే కారణం అని నేను రుజావు చేయిస్తా....జాగ్రత్తగా ఉండు" అనేసి వెళ్ళిపోయాడు.

నేలమీద మసిమరకలు!

'చిట్టితల్లీ దారుణంగా మోసపోయావమ్మా!'

5

రవి చెప్పింది కూడా నిజమే. నాకున్న ఒకేఒక ఆధారం ఆ లేఖ. అది కాలి బూడిదయిపోయాక నేనేం చేయగలను. నా చెల్లిని చంపిన హంతకుడు నా కళ్ళ ముందే తిరగటం కాకుండా నన్ను బెదిరించి మరీ వెళ్ళాడు.

నా చెల్లి మరణానికి నేను కారణమని రుజావు చేస్తాడట. ఎంతటి నీచమైన ఆరోపణ!

నాకు వెంటనే రంగారావు మదిలో మెదిలాడు.

రంగారావు గురించి వినటమేగాని నాకు పరిచయం లేదు.

రంగారావు ఆ పట్టణంలో పేరున్న రౌడీ. అతన్ని అలా పిలవటం కూడా సరయింది కాదేమో. అతను తన కంటూ ఓ వర్గాన్ని నిర్మించుకున్నాడు. అతినికి రాజకీయ పార్టీల్తో సంబంధాలున్నాయి. అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుంటాడని చెప్పుకుంటారు.

రంగారావు తన బృందంతో బయలుదేరితే వ్యాపారస్థులు వేలాది రూపాయలు చందాగా ఇస్తుంటారట. సంవత్సరానికెంతని చెప్పి ఆయనకు వాటాలు వెళుతుంటాయి. ఇలాంటిదే మరో గ్రూపు పట్టణంలో వుంది. అవి రెండూ అస్తిత్వం కోసం పోరాడుతుంటాయి.

అందుకే తరచుగా పట్టణంలో కొట్లాటలు, హత్యలు కూడా జరుగుతుంటాయి. ఆయా సందర్భాలలో రంగారావు పేరు వినిపిస్తుంది తప్ప అతనేనాడు అరెస్ట్ కాలేదు. అయినా చాలామంది నాకో విషయం చెప్పారు.

రంగారావుకు స్త్రీ పట్ల గౌరవం వుందట.

ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారిని అంత తేలిగ్గా విడిచిపెట్టడట. కట్నం చాల్లేదని పీటలమీద ఆగిన పెళ్ళిళ్ళు ఆయన చేయించాడని, అలాగే కట్నం కోసం హింసించేవారిని కఠినంగా హెచ్చరించేవాడని చెప్పటంతో నాకు రంగారావును కలుసుకోవాలనిపించింది.

మొత్తంమీద ఎలాగో రంగారావును కలిశాను.

నా కథంతా చెప్పాను. విన్నాడు. ఆ తర్వాత రవి గురించి చెప్పాను.

"నా చెల్లి చచ్చిపోయింది. అదిచూసి భరించలేక నా తల్లి గుండాగిపోయింది. నేను ఏకాకినయ్యాను. ఒక స్త్రీకి జరిగిన అన్యాయం ఇది. కానీ అతనిలో ఏ కొశాన పశ్చాత్తాపం లేదు. అతను ఇంతటితో తన పద్ధతిమార్చుకోవటం లేదు. అంటే ఇంకెంత మంది జీవితాల్తో అతను ఆడుకోబోతున్నాడు. నా చెల్లికి జరిగిన అన్యాయం మరో స్త్రీకి జరగకూడదు" అని చెప్పాను.

రంగారావు తలూపాడు.

నేను బయటకు వచ్చేశాను. రంగారావ్ అనుచరులకు గట్టిగా చెప్పాను.

"మీరెలా అయినా ఆయన్ని ఒప్పించండి. రవికి బుద్ధి చెప్పండి."

"సర్లే" అన్నారు వారంతా.

వారికి నేను పార్టీ చేశాను. జీవితంలో అంతగా త్రాగేవాళ్ళను చూడటం అదే మొదటిసారి. ఎంత త్రాగారో, ఎంత తిన్నారో నేను పరిశీలించలేదు. బిల్లు చూసేసరికి నాకు మతిపోయింది. అయినా ఫర్వాలేదు. ఈ దెబ్బతో రవికి బుద్ధి వస్తుంది.

ఓ రకంగా కిరాయి ఇచ్చి రవితో తలపడుతున్నాననిపించింది. ఆ విషయంలో నా అసమర్థత స్పష్టంగా కనపడుతూంది.

రెండు రోజుల తర్వాత రవి కనపడ్డాడు.

అదే చిరునవ్వుతో, అదే అహంకారంతో.

"ఏరా....రంగారావుతో చెప్పావట. అసలు రంగారావెవరో ముందు తెలుసుకొని వెళ్లాల్సింది. నీకంత తెలివితేటలు వుంటే బాగానే ఉండేది. నువ్వు నన్నేం చెయ్యలేవు. నీ చేతికి కత్తిస్తాను, పొడిచి చూడు" అన్నాడు జేబులోనుండి బటన్ నైఫ్ తీస్తూ.

నాకు తిరిగి వెర్రిగా చూడటం మినహాయించి అవయవాలు కదలటంలేదు

"ఇంత వెర్రి వెధవకి కోపమెందుకురా. నువ్వు రక్తం చూస్తేనే గుండాగి చచ్చిపోయేటట్టున్నావు. ఇంక నా ప్రాణం ఏం తీస్తావు? మర్యాదగా చెబుతున్నాను. మరో రెండు వారాల్లో నువ్వీ వూర్లో యెక్కడ కనబడ్డా నీ శవం మాత్రమే మిగులుతుంది."

రవీంద్ర వెళ్ళిపోయాడు.

నాకు విస్మయం, దుఃఖం, కసి, బేలతనం, అన్ని భావాలు ఒకే సమయంలో కలిగాయి.

పరిగెత్తుకుంటూ రంగారావు దగ్గరకెళ్ళాను.

అతను నొసలు చిట్లించి నా వంక చూశాడు.

"సార్" అన్నాను యేమనాలో తెలీక.

నాకయితే ఎన్నెన్నో మాటలు జలపాతంలా వర్షించాలనుంది.

"వాడు మనకు కావల్సినవాడయ్యా" అన్నాడు రంగారావు.

"మనకు కావాల్సిన వాళ్ళు నేరాలు చెయ్యొచ్చా" నా కళ్ళు ప్రశ్నించాయి.

"అయిపోయిందేదో అయిపోయింది. ఇప్పుడు ఎవరూ చేయగలిగింది లేదు. వాడికి చెప్పాలే" అన్నాడు రంగారావు.

ఆ తర్వాత అతను మాట్లాడలేదు.

నేను గుటకలు మింగుతూ నిలబడ్డాను.

ఆ నిశ్శబ్దం నన్ను వెళ్ళవచ్చని శాసించింది.

వెనక్కి తిరిగి వచ్చేశాను.

మరో ప్రక్క రవి చేసిన హెచ్చరిక వినపడుతోంది.

నేనెంత అసమర్థుడిగా ఉండిపోయాను. నా చెల్లి, తల్లి మరణానికి కారణమయిన వ్యక్తిని అటు చట్టానికి లొంగేలా చేయలేకపోయాను. నేనూ ఏమీ చేయలేక పోతున్నాను. పగతీర్చుకోవటం అనే విషయంలో మొదట్లో నాకంత పట్టుదల లేదు. రవీంద్ర నన్ను రెచ్చగొట్టాడు.

అతని అహంకారం నన్ను ఉన్మాదిగా మార్చాయి.

ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి—

ఈ నడుమ కాలంలో నా జీవితానికి చెందిన ప్రధాన మార్పులన్నీ ఈ సంఘటనతోనే ముడిపడ్డాయి. ఈ సంవత్సరాలన్నింటా నేను మౌనం పాటించాను. అదెంత కష్టతరమైన విషయమో. అయినా నేను పగనుండి యే

మాత్రం దూరం కాలేదు.

మాకున్న ఒకే యిల్లు అమ్మి ముందు ఆ వూరు విడిచి పెట్టాను. రవి నా విషయం పూర్తిగా మరిచిపోయాడు. నాకదే కావాలి. నన్ను గురించిన యెలాంటి అనుమానం లేని రోజున నేను కార్యక్రమం మొదలు పెడతాను.

రవి దృష్టిలో నేను అర్భకుడ్ని. ఏమీ చెయ్యలేని వాడిని. పగ తీర్చుకుంటానని నేనంటే విరగబడి నవ్వుతాడు కూడా. రవికి నాలాంటి శత్రువులు అనేకమంది వున్నారు. నేనేం చేసినా వెంటనే అనుమానం రాదు.

నేను ఊరినుండి వెళ్ళిపోయినా నా దృష్టి అంతా రవిమీదే. అతనికి చెందిన వివరాల్ని సేకరించాను. అతనికి పెళ్ళికావటం, పిల్లలు పుట్టడం తెలుస్తూనే వుంది.

నేను పగతీర్చుకునే మార్గంలో మొదట ఎన్నుకొంది డైరక్టుగా దాడిచేసే పద్ధతి. టైం బాంబులు రెండు సేకరించి వాళ్ళింటిలో పెట్టాలనుకున్నాను. కానీ ఎందుకో ఆ పద్ధతి నాకు నచ్చలేదు. చివరి క్షణంలో విరమించుకున్నాను.

నాలో మానవత్వపు భావాలు యెక్కువగా వుండటంతో పాటు జీవితంమీద తీపి ఎక్కువగా వుంది. నేను ఈ విషయంలో ఇప్పటిదాకా ఓడిపోతుండటానికి కారణం అదే. నాకీ ప్రపంచంలో ఎవరూ లేకపోయినా, నా జీవితంలో ప్రధాన భాగం, ఆవేశంలో ఖర్చయిపోతున్నా నాకు బ్రతకాలనుంది. అందుకే సాధ్యమైనంతవరకూ చట్టానికి దొరకకుండా నే బయటపడాలి.

ఒకటి మాత్రం ఒప్పుకుంటాను.

ఇదో రకమైన విచిత్రమైన ఆత్మహత్య.

6

నరసయ్య దగ్గరకు రెండు రోజుల తర్వాత వెళ్లాను.

నన్ను చూసి నరసయ్య నవ్వాడు.

"దొరికిందా" అన్నాను ఎక్సైట్‌మెంట్‌తో.

"ఎందుకయ్యా అంత తొందర" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"రాజాలాంటి పాము దొరికింది."

నా కళ్ళు సంతోషంతో వికృతంగా తళతళలాడాయి.

"ఏం చేత్తావయ్యా....బుట్టలో తీసుకెళ్ళి ఆ గదిలో జారవిడుస్తావా" అన్నాడు నరసయ్య.

"నీకు చెప్పటం మరిచిపోయాను. ఈ పామును పార్శిల్ చేయాలి" అన్నాను.

"పార్శిలా...."

"అవును. రెండు రోజులు బ్రతుకుతుందా?"

"రెండు రోజులా."

"అవును. ఈ రోజు పోస్టు చేసినా చేరేనాటికి రెండు లేక మూడు రోజులు పట్టవచ్చు."

"సర్లే ఆ ఏర్పాటు నేను చూస్తాలే" అన్నాడు నరసయ్య.

గాలివచ్చే యేర్పాట్లతో పార్శిల్ చేయగలడను కున్నాను.

అయితే వెంటనే నాకు మరో అనుమానం వచ్చింది.

పార్శిల్ చేశాక అది లేచి బుసలు కొడుతుంటే, పెట్టంతా కదులుతుంటే అనుమానం కలుగుతుందేమో!

ఆ విషయం కూడా నరసయ్యతో చెప్పాను.

నరసయ్య కూడా కొంచెంసేపు ఆలోచించాడు.

"సరే. ఆ విషయం కూడా నేను చూస్తాను. నువ్వేం అనుమాన పడకు" అన్నాడు.

ఇప్పుడు నాకు సంతోషం కలిగింది.

ఈసారి విజయం సాధించటం ఖాయం.

నా ప్రయత్నానికి నరసయ్య సహకారం లభించటం అదృష్టం. రెండు గంటలు నేను ఆలోచిస్తుండిపోయాను.

సరిగ్గా రెండు గంటల తర్వాత నరసయ్య పెట్టెతో వచ్చాడు.

అంతకుముందే నరసయ్య నన్ను పిలిచాడు. "పామును చూడవయ్యా పంతులూ" అన్నాడు.

నా జీవితంలో అంత వేగమయిన పామును, అంత దగ్గరనుండి చూడటం అదే మొదటిసారి.

సర్రున లేచి నిలబడింది.

నాకు అరికాళ్ళనుండి చెమటలు పుట్టుకొచ్చాయి.

నల్లగా నిగనిగలాడుతోంది.

దాని పడగ చూశాక అనుకున్నాను.

'నల్లత్రాచు.'

వయసులో వుందనుకుంటాను. అది కాటువేస్తే నిస్సందేహంగా మనిషి చచ్చిపోతాడు.

'బుస' అంటే వినటమే గాని నేను విని ఎరగను.

మొదటిసారి విన్నాను. ఆ 'బుస'ను జీవితంలో మరిచిపోలేను.

నరసయ్య చెయ్యి మరింత వేగంగా కదిలింది.

నల్లత్రాచును వడిసి పట్టుకొని మూతవేశాడు.

నాకింకా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

అలాంటి పాము పెట్టెలో పడుకుని ఉంటుందా అనే అనుమానం పీడిస్తూనే వుంది.

నరసయ్య మాత్రం ధైర్యం చెప్పాడు.

'నీకెందుకు చూసుండు' అన్నాడు.

మరేం చేశాడో తెలియదుగాని నరసయ్య నా చేతి లోకి ప్యాకెట్ ఇచ్చేటప్పటికి లోపల ఎలాంటి అలికిడి లేదు.

"ఇంకేం కారు. మరీ ఆలస్యమయితే అది చచ్చిపో గలదు" అన్నాడు నరసయ్య.

"మరీ ఆలస్యం కాదులే. అడ్రసు కరక్టుగా వుంది కాబట్టి జాగ్రత్తగానే వెళుతుంది" అన్నాను.

"నీ పనయితే ఫర్వాలేదయ్యా పంతులూ.... రెండు జిల్లాలవతలనుండి వచ్చావు" అన్నాడు.

నేను నరసయ్య చేతిలో అరువందలు వుంచాను.

తృప్తిపడినట్లే కనిపించాడు.

"నిజంగానే నా దగ్గర అంతకంటే లేవు. పనయితే సంతోషంగా కలుసుకుంటాను" అని చెప్పాను.

"దాందేముందిలే" అన్నాడు నరసయ్య.

నరసయ్య దగ్గర సెలవు తీసుకొని బయలుదేరాను.

ఆ పార్శిల్ నా చేత్తో పట్టుకోవటానికే భయంగా ఉంది.

అయినా తప్పదు కదా!

బస్సు త్వరగానే దొరికింది. ఎక్కాక కాళ్ళదగ్గర పెట్టుకున్నాను. అప్పుడుగాని నా గుండెదడ తగ్గలేదు.

నరసయ్యపట్ల నాకు కృతజ్ఞతాభావం మరింతగా పెరి గింది.

అతనే కారణంలో నాకు సహాయం చేసినా ఒక విష యంలో మాత్రం నేను నరసయ్యకు నిజం చెప్పలేదు.

నా పగకు చెందిన విషయాలన్నీ వాస్తవాలే. నా

ఊరి వివరాలే కల్పించినవి. ఆ మాత్రం జాగ్రత్త ఉండటం అవసరం అనుకున్నాను. ఇప్పుడు వెళ్ళి మెయిన్ పోస్టాఫీస్‌లో బుక్ చెయ్యాలి. అక్కడ ఎనిమిది గంటలదాకా వుంటారు. బస్సు ఏడుగంటలకు చేరుతుంది. రిక్షాలో వెళ్ళాలి.

ఆ పార్సిల్ రవి పేరుమీద బుక్ చేస్తున్నాను. అది రిజిస్టర్డు పార్సిల్. రవి సంతకం పెట్టి తీరాలి. సంతకం పెట్టి పార్సిల్ అందుకుంటాడు.

ఫ్రమ్ అడ్రస్ ఏదో సృష్టించి రాశాను. ఈ పని పూర్తవటంతో నా రూపం పూర్తిగా మారిపోతుంది. నా మీసాలు, గడ్డం, తల వెంట్రుకలు ఏవీ వుండవు. నా దుస్తుల విషయంలో కూడా పూర్తి మార్పులొస్తాయి. ఆ తర్వాత నన్ను గుర్తుపట్టడం కూడా కష్టమే.

మామూలుగా అన్నీ నేననుకున్నట్లు జరిగి, రవి నల్ల త్రాచు కాటుకు బలయితే, అది ఎక్కడ పోస్టు చేయ బడిందో ఎన్ని గంటలకు పోస్టు చేయబడిందో వివరాలు సేకరిస్తారు. అప్పుడు బుక్ చేయటానికి వచ్చినవారి రూపం గురించి కూడా పరిశోధన ప్రారంభమవుతుంది.

అందుకే అన్నివిధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఆ పార్శిల్ మీద నా వేలిముద్రలుగాని, నరసయ్య వేలి ముద్రలుగాని పడకుండా తుడిచెయ్యాలి.

బస్సు స్టేషన్‌లో ఆగింది.

వెంటనే దిగాను. చేతిలో పార్సిల్‌తో చకచక నడుస్తుంటే రిక్షావాళ్ళు చుట్టుముట్టారు.

"రాంనగర్" అన్నాను.

"మూడు రూపాయలిప్పించండి"

బేరం మాట్లాడే సమయం లేదు.

వెంటనే ఎక్కేశాను.

"తొందరగా పోనీ"

"అయ్యా"

రిక్షా వేగంగానే తొక్కుతున్నాడు.

రామ్‌నగర్ వచ్చింది.

నాలుగు రూపాయలు చేతిలో వుంచాను.

"చిల్లర లేదండయ్యా"

"వుంచుకో"

చక, చక రూంలోకి నడిచాను.

వేలిముద్రలు లేకుండా జాగ్రత్తగా తుడిచాను.

పార్శిల్ కోసం ముందే సేకరించిన స్టాంపులంటించాను. ఆ తర్వాత ఓ పేపర్ చుట్టి బయటకు వచ్చాను.

"రిక్షా.... రిక్షా...."

"ఎక్కండికండి"

"పోస్టాఫీస్‌కు పోనీ"

రిక్షా కదిలింది.

నా మొఖంలో టెంక్షన్ కనపడకుండా వుండాలని విశ్వ ప్రయత్నం.

పోస్టాఫీసు ముందాగింది.

అయిదు రూపాయల కాయితం అతని చేతిలో పెట్టాను.

"వుండు వస్తాను" అ నేసి లోపలికెళ్ళాను.

ఆ క్యూలో నలుగురయిదుగురున్నారు.

నేను వెళ్ళి వారి వెనక నిలబడ్డాను.

క్లర్కు చకచక తీసుకుంటున్నాడు.

నావంతు వచ్చింది.

పార్శిల్ అందిస్తుంటే నా చేతులు స్వల్పంగా కంపిస్తున్నాయి.

అక్కడ కూర్చున్న వ్యక్తి రొటీన్‌గా వర్క్ చేసుకుపోతున్నాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే నామీద అనుమానం వచ్చేదేమో. వేమెంట్ పూర్తయింది.

స్టాంపులు చూశాడు.

సరిపోయాయనుకుంటాను.

స్టాంప్ వేశాడు.

రశీదు కూడా నాకు ఇచ్చాడు.

ఆ పార్శిల్ తీసి ప్రక్కన పెట్టాడు.

అప్పటిదాక నా గుండె దడదడలాడుతూనే వుంది.

నా కార్యక్రమంలో ఓ అంకం ముగిసింది.

మెమ్మదిగా బయటకు వచ్చాను.

ఒకవేళ రవి ఊర్లో లేకపోతే?

అతను తిరిగి వచ్చేదాకా ఆ పాము బ్రతుకుతుందా?

అది వెళ్ళే వాహనాలు జాగ్రత్తగా వెళతాయా?

మామూలుగానే అయితే ఒక్కరోజులో చేరాలి.

రిజిస్టర్డు పార్శిల్ కాబట్టి రెండు రోజులు—

అంతకంటే ఎక్కువ అవసరం లేదు.

ఆలోచనలతో రెండురోజులు గడిచిపోయాయి.

తెల్లవారింది—

నాకు ప్రకంపనాలు మొదలయ్యాయి.

సరిగ్గా పదిగంటల తర్వాత పోస్టుమాన్ బయలుదేరతాడు.

నేను ఫ్రమ్ అడ్రస్‌గా రాసింది వాళ్ళ బంధువులది.

రవి ఆశ్చర్యంగా పార్శిల్ తీస్తాడు.

ప్రచండ వేగంతో లేచిన నాగు అందుకొన్న కాటుకు చావుకేక ప్రతిధ్వనించగా....

భయంతో కొయ్యబారిపోతుంటే ....

నోటినుండి నురగలు కక్కుతుంటే....

జర, జర పాక్కుంటూ వెళుతుంది.

సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆ క్షణాలు ఈ రోజుతో సమాప్తం అవుతున్నాయి.

"అమరజీవి జోహార్"

నాకు సంతోషంగా వుంది.

వెంటనే ఆ ఊరెళ్ళి దూరంగా నిలబడి రవి ఇంటి ముందు గుమికూడిన ప్రజానీకాన్ని చూడాలని ఉబలాటంగా వుంది. ఆ కోర్కెను బలవంతంగా అణుచుకొంటున్నాను.

అత్యంత సంతృప్తిగా ఈరోజు గడిచిపోయింది.

ఎందుకో నాకు ఆ నల్లత్రాచుమీద విపరీతమైన నమ్మకం పెరిగిపోయింది.

తనను రెండురోజులుగా బంధించారన్న ఆవేశంతో వుంటుంది.

పార్శిల్ తియ్యటం ఆలశ్యం....

ఆ వేగం నా కళ్ళముందు ఇంకా కనిపిస్తూనే వుంది.

7

వెంటనే ఈ వార్త పేపర్లో రాగలదని నేను భావించక పోయినా, మరుసటి రోజునుండే అన్ని పేపర్లూ చదువుతున్నాను. సాయంకాలందాకా లైబ్రరీలో వుండి అన్ని పేపర్లనూ మొదటినుండే చివరిదాకా చదివాక లేచే వాడ్ని కాదు.

ఇలాంటి వార్తలు ముందు అన్ని పేపర్‌లలో రావు. ఓ పత్రిక ముందు ప్రచురిస్తే, ఆ తర్వాత అందరూ ప్రచురించటం చేస్తారు.

రెండు రోజుల తర్వాత....

ఎదురు చూస్తున్న ఆ వార్త రానే వచ్చింది.

"రిజిస్టర్ పార్శిల్లో నల్లత్రాచు!
ఒకరి మరణం!!"

నా చేతిలో పేపర్ వణకటం నాకు స్పష్టంగా తెలుస్తోంది.

"ఇక్కడకు బి. రవీంద్ర అనే పేరుతో బుక్ చేయబడ్డ రిజిస్టర్డు పార్శిల్ అనుమానాస్పదంగా కనిపించటంతో తెరుస్తుండగా, అందులోని నల్లత్రాచు కాటుకు పోస్టల్ ఉద్యోగి ఒకరు మరణించారని తెలుస్తోంది. వెంటనే ఆ పామును చంపివేయటం జరిగింది. ఈ విషయం మీద దర్యాప్తు జరుగుతోంది...."

నా కళ్ళను నేను నమ్మలేకపోయాను!

ఆ క్రింద ఈ వాక్యంతో ఆ వార్త ముగిసింది.

"అయితే ఏ ఉద్దేశ్యంతో ఈ పార్శిల్ పంపబడిందో అది యాదృచ్ఛికంగా నెరవేరటం గమనార్హం. ఈరోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్ర మరణించారు!"

ఒక్కటి మాత్రం నిజం.

పోస్టల్ వారు అనుమానంతో కాదు తీసింది.

కక్కుర్తితో....

అనుమానంతో నే తీసుంటే___

153

ఒకరి మరణం సంభవించేది కాదు....

దర్యాప్తు జరగవలసింది—

పార్శిల్లో పాముగురించి కాదు!

పోస్టల్ వారికి ఇతరుల వస్తువులమీద ప్రేమెందు కనే విషయం మీద!

—: అయిపోయింది :—